జోరుగా ఆక్రమణలు

- ప్రధాన రహదారులకు ఇరువైపులా ఇదే తీరు
- వెలుస్తున్న దుకాణాలు
- తీవ్రమవుతున్న ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు



మైపాడు రోడ్డులో జాఫర్‌సాహెబ్ కాలువ పక్కన ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు

నెల్లూరు(బారకాసు): నగర పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నా, నగరపాలక సంస్థ అధికారుల ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఫలితంగా ఆక్రమణలు నానాటికీ ఎక్కువవుతున్నాయి. ఈ పరిణామాల క్రమంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతూ నగరవాసులకు నరకాన్ని చూపుతోంది.

అమలుకాని మంత్రి ఆదేశాలు

నగరంలో ఖాళీ దొరికితే కబ్జాలకు కొందరు పాల్పడుతున్నారు. ఆర్ అండ్ బీ రోడ్లు, పార్కులు, ఇరిగేషన్ కాలువలూ ఆక్రమణకు గురవుతున్నాయి. నెల్లూరును స్మార్ట్ సిటీ చేస్తాం.. నగర సుందరీకరణే తన ప్రథమ ప్రాధాన్యం.. ఆక్రమణలు ఎక్కడున్నా వాటిని తొలగించాల్సిందేనని.. అనుమతి లేని భవనాలను కూల్చేయాలని అధికారులతో నిర్వహించిన పలు సమావేశాల్లో మంత్రి నారాయణ తెలిపారు. అయితే ఆయన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఏ మాత్రం అమలుకావడంలేదు.

ఇదీ తంతు..

నగరంలోని జీఎస్టీ, మినీబైపాస్, ముత్తుకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో తోపుడు బండ్లు తదితరాలను ఏర్పాటు చేసుకున్నారు. వీరిని చూసి కొందరు కబ్జాదారులు రహదారుల వెంబడి చిన్న రేకుల షెడ్లను ఏర్పాటు చేసి దుకాణాలుగా మార్చుకున్నారు. మరికొందరు నిర్మాణాలు జరిపి అద్దెకు ఇవ్వడం గమనార్హం. దీంతో విశాలంగా ఉండాల్సిన రహదారులు కుచించుకుపోతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇంత జరుగుతున్నా, టౌన్‌ప్లానింగ్ అధికారులు తమకేమీ పట్టదనే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు చేపడతాం

నగరంలోని పలు రహదారుల వెంబడి ఆక్రమణలున్న మాట వాస్తవమే. ఇదే విషయం కమిషనర్ దృష్టికి వచ్చింది. కమిషనర్ ఆదేశాల మేరకు వీటిని తొలగిస్తాం.

– కృష్ణకిశోర్, సిటీ ప్లానర్

ఇవీ ఉదాహరణలు..

- ముత్తుకూరు రోడ్డు కూడలి నుంచి నారాయణ హాస్పిటల్‌కు వెళ్లే రహదారి దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ఉంటుంది. ఇక్కడ కృష్ణపట్నం కాలువ వెంబడి ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కొందరు కబ్జా చేసి అందులో దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు ఆక్రమించిన స్థలాన్ని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.
- మైపాడు రోడ్డు, జాఫర్‌సాహెబ్ కాలువ వెంబడి ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు ఆక్రమించి దుకాణాలను నెలకొల్పారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదేశాల మేరకు పొదుపు మహిళల కోసం అంటూ పలు దుకాణాలను ఏర్పాటు చేశారు.
- నగరంలోని విద్యుత్ భవన్ ప్రహరీని ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో అనేక దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.
- మినీబైపాస్ వెంబడి ఉన్న ఖాళీ స్థలం ఆక్రమణకు గురైంది. ఈ రోడ్డు వెంట నర్సరీలు, టిఫిన్, పండ్లు.. ఇలా అనేక దుకాణాలను ఏర్పాటు చేశారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి



ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): నగరంలో సక్రమంగా నిర్వహించని ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులను జారీ చేయాలని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ చైతన్య ఆదేశించారు. హరనాథపురంలోని పలు వీధుల్లో పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగేందుకు ఆస్కారం ఉందని తెలిపారు. దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. కార్పొరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి



సమావేశాన్ని నిర్వహిస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): కుష్టు రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా కుష్టు, క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ కోరారు. జిల్లాలో కుష్టు వ్యాధి కేసులు, వ్యాధితో బాధపడే వారికి ప్రభుత్వపరంగా అందుతున్న సాయం తదితరాలపై నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కుష్టు కేసులను కొత్తగా గుర్తించేందుకు గానూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డీపీఎమ్మార్ క్యాంపులను ప్రతి నెలా నిర్వహించాలని కోరారు. కొత్త కేసులను గుర్తించిన వెంటనే వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. పారిశ్రామికవాడలు, మురికివాడల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించి అక్కడి వారికి పరీక్షలు చేయాలని చెప్పారు. ఫిజియోథెరపిస్ట్‌లు నరసింహులు, మల్లమ్మ, ప్రసాదాచారి, డీఎఫ్ఐటీ కేంద్రానికి చెందిన పీటర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

- టైలర్స్ కాలనీ, ఆర్డీఏ కార్యాలయ వీధి, చాకలివీధి అర్బన్ హెల్త్ సెంటర్లను ఖాదర్‌వలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీబీ కార్డులను పరిశీలించి.. విషజ్వరాలపై ఆరాతీశారు.

వీసీ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నెల్లూరు (టౌన్): ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను నియమించడంతో పాటు రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న వీసీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యా, వసతి దీవెనకు సంబంధించి రూ.3480 కోట్ల బకాయిలున్నాయని, వీటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై స్పష్టత ఇవ్వకుండా, ట్వీట్లకే రాష్ట్ర ప్రభుత్వం పరిమితమవుతోందని విమర్శించారు. విద్యాదీవెన పెండింగ్‌లో ఉండటంతో ఫీజును చెల్లించాలంటూ డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, శ్రీహర్ష, నేతలు జీవన్, శివ, పవన్, విష్ణు, యశ్వంత్, ప్రశాంత్, బాలాజీ పాల్గొన్నారు.

వెంకటేశ్వరపురంలో చోరీ

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీ సమీపంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. విజయ డెయిరీ సమీపంలో మస్తాన్ సాహెబ్.. జనార్దన్‌రెడ్డికాలనీలో ఆయన కుమారుడు కరిముల్లా ఉంటున్నారు. అనారోగ్యం కారణంగా కుమారుడి వద్ద నెల రోజులుగా ఉంటూ అప్పుడప్పుడూ ఇంటికొచ్చేవారు. ఈ క్రమంలో ఇంటి తాళాలను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి 10 గ్రాముల బంగారు, వెండి పట్టీలు, కొంత నగదును అపహరించుకెళ్లారు. ఇంటికొచ్చిన బాధితుడు చోరీ విషయాన్ని నిర్ధారించుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

అండర్ పాస్ ఏర్పాటుకు వినతి



నెల్లూరు(సెంట్రల్): కొడవలూరు మండలం చంద్రశేఖరపురం జంక్షన్ వద్ద గల జాతీయ రహదారిపై వాహనాలు వెళ్లేందుకు వీలుగా అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రాన్ని ఆయన అందజేశారు. అండర్ పాస్ లేకపోవడంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని చెప్పారు.

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు (టౌన్): వెంగళరావునగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చేయడం నేరమని చెప్పారు. అనంతరం గుడ్.. బ్యాడ్ టచ్‌పై వివరించారు. హెచ్ఎం భూషణం, ఉపాధ్యాయులు వెంకట్రావు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ జట్ల ఎంపిక



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఆర్చరీ జిల్లా జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన వివరాలను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు తెలియజేశారు. ఇండియన్ రౌండ్ పురుషుల విభాగంలో సాత్విక్, వెంకటలోకేష్, కిరణ్‌తేజ, చక్రేష్‌కుమార్‌యాదవ్, లోహిత్‌కుమార్‌యాదవ్, ప్రసన్నకుమార్.. మహిళల విభాగంలో నిఖిల, షణ్ముఖి, నవ్యాంజలి, లక్ష్మీ ప్రశాంతి, దీత్యా చండిక, లాస్య ఎంపికయ్యారని చెప్పారు. రికర్వ్ రౌండ్ పురుషుల విభాగంలో సాయిమౌర్య, తరుణేష్‌జాత్య, అక్షయ్‌మహదేవ్, రాజేష్, మనోజ్, శశిధర్.. మహిళా విభాగంలో నిషిత.. కాంపౌండ్ రౌండ్ పురుషుల విభాగంలో ఆదినారాయణ.. మహిళా విభాగంలో హేమలత ఎంపికయ్యారని వివరించారు. విజయవాడలో డిసెంబర్ మూడు నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు.

ఆమంచర్లలో 'పొలం పిలుస్తోంది'



మాట్లాడుతున్న సత్యవాణి

నెల్లూరు సిటీ: ఆమంచర్ల, సౌత్‌మోపూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి మాట్లాడారు. విచక్షణరహితంగా రసాయన ఎరువులను వినియోగిస్తే పంట ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా సాగు ఖర్చు పెరుగుతుందని చెప్పారు. రైతులకు అవసరమైన మేర యూరియా, డీఏపీ, పొటాష్, ఎరువుల నిల్వలున్నాయని తెలిపారు. అనంతరం వ్యవసాయ సహాయ సంచాలకుడు సర్పోజీ మాట్లాడారు. వరిలో చీడపీడలను వివరించి, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు శేషగిరిరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంట బీమా చేసుకోవాలని కోరారు. సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి ఎకరా వరి పంటకు రూ.168 ప్రీమియాన్ని చెల్లిస్తే, రూ.42 వేల బీమా సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలపై చర్యలు చేపట్టరూ..

నెల్లూరు రూరల్: పేదలకు అండగా ఉండాల్సిన ఆధార్ కేంద్రాలను కొందరు వ్యాపారంగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా మాజీ సభ్యుడు శేషం సుదర్శన్ ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్లో జేసీ కార్తీక్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బృందావనంలోని కోటక్ మహీంద్రా బ్యాంక్ కింద ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రంలో అక్రమంగా వసూలు చేస్తున్నారని చెప్పారు. చిన్నయ్య, సూరి, సురేష్, రవి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లపై సమావేశం



నెల్లూరు(బారకాసు): రెవెన్యూ వసూళ్లపై సమీక్ష సమావేశాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అదనపు కమిషనర్ నందన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రెవెన్యూ వసూళ్లను పెంచే అంశమై పలు సూచనలు చేశారు. రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చెన్నైలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో నగరంలోని అవెన్యూస్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కృష్ణచైతన్య, ప్రధానోపాధ్యాయురాలు శ్వేత సంధ్య మాట్లాడారు. మొత్తం 27 పతకాలను సాధించారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన యోగా మాస్టర్లు పద్మావతి, రేవతికి అభినందనలను తెలియజేశారు.

సకాలంలో ధ్రువీకరణ పత్రాలివ్వాలి



ఏఐవైఎఫ్ నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతోందని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా ఆరోపించారు. నెల్లూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనను బుధవారం చేపట్టిన అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 30తో ముగియనుందని వివరించారు. అయితే పథకాలకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీకి 30 రోజుల సమయం పట్టొచ్చని సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు చెప్పుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వీటిని త్వరితగతిన అందజేయాలని కోరారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ భగత్ సింగ్‌కాలనీలో గల టిడ్కో సముదాయంలో అక్రమ కట్టడాన్ని అధికారులు బుధవారం తొలగించారు. 'అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ' అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో అనుమతుల్లేకుండా చేపట్టిన అక్రమ కట్టడాన్ని కూల్చేశారు.

అక్రమంగా నిర్మాణాలు జరిపితే చర్యలు

వెంకటేశ్వరపురంలోని ఫేజ్ - 1 టిడ్కో సముదాయంలో గల ఖాళీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

మేయర్‌ను కలిసిన అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ అధికారులు మేయర్ స్రవంతిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు. ఆర్వో ఇనాయతుల్లా, ఆర్ఐలు వంశీనాథ్‌రెడ్డి, కారీక్‌రెడ్డి, సందీప్, శరత్‌బాబు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరుడికి భస్మాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో భస్మాభిషేకాన్ని గురువారం నిర్వహించనున్నామని ఈఓ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రదోషకాల అభిషేకం, వెండినంది ప్రాకారోత్సవాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా పడిపూజ



నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో పడిపూజను వేడుకగా బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కేరళకు చెందిన వడకేడత్తు పెరుంబడప్పమన కేశవన్ నంబూద్రిపాద్ ఆధ్వర్యంలో జరిపారు. క్షీరాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, నవకాభిషేకం, శీవేలి ఉత్సవం, మహాదీపారాధన తదితరాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా బీరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, రాధిక, జూగుంట పురుషోత్తం, స్నేహలత దంపతులు వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, జీవీకే రెడ్డి, పావళ్ల ప్రసాద్, కత్తి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో వివరాలు నమోదు చేసుకోండి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ యాప్‌లో ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేయాలని ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య కోరారు. జిల్లాలోని ఆయుర్వేద డాక్టర్లు తమ వివరాలను యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని మూలాపేటలోని ప్రభుత్వ ధన్వంతరి ఆయుర్వేద వైద్యశాలలో బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలు తమకు సమీపంలోని ఆయుర్వేద వైద్యశాలలకు వెళ్లి వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. అనంతరం ఆయుర్వేదం ద్వారా అందరికీ ఆరోగ్యం అందేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌తో ఇల్లు భద్రం

నెల్లూరు(క్రైమ్): ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌తో ఇల్లు భద్రంగా ఉంటుందని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య పేర్కొన్నారు. నేర నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎల్‌హెచ్‌ఎమ్మెస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నారనే అంశాన్ని గుర్తిస్తే 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. స్థానికులు రమణయ్య, అమర్, రమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి



విడవలూరు: ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఊటుకూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్ పేర్కొన్నారు. ప్రమాదాల నివారణపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. తుఫాన్లు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు తదితర అత్యవసర సమయాల్లో చేపట్టాల్సిన చర్యలను ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ దరీపా తెలియజేశారు. అత్యవసర సమయాల్లో వినియోగించే టూల్ కిట్‌ను పాఠశాలకు అందజేశారు. ఎంఈఓ నాగపద్మ, సర్పంచ్ వెంకటశేషమ్మ, సుబ్బారావు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రవికుమార్, సందీప్‌కుమార్ రెడ్డి, ఎల్వో మల్లికార్జున్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



కోవూరు: జనరేట్ యువర్ బిజినెస్ ప్రోగ్రామ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్థానిక వైకేఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం, ప్రిన్సిపల్ లక్ష్మీప్రసూన, ఏడీఏసీఈ శ్రీధర్‌రావు, మాస్టర్ ట్రెయినర్ మధుసూదన్, ప్రదీప్ పాల్గొన్నారు.

నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

కోవూరు: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి పేర్కొన్నారు. కోవూరు పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పాటూరులోని చెక్కిరాలదిబ్బ గిరిజన కాలనీలో పర్యటించారు.